క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పెద్దమ్మగడ్డ, ప్రభుత్వ ఐటీఐ, ఇండస్ట్రియల్ ఏరియా, వరంగల్ సిటీ సెంటర్, కియా షోరూం, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే 'చల్లా'

ఖిలా వరంగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు కార్పొరేటర్లు మనోహర్, సుంకరి మనీషా,గద్దె బాబు మ ర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేటీఆర్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేశా రు. యువతకు అవకాశం ఇచ్చిన ధర్మారెడ్డిని కేటీఆర్ అభినందిస్తూ, కష్టకాలంలో పార్టీకి వె న్నంటూ ఉన్న మీలాంటి యువతకు ముస్ముందు పార్టీలో మరింత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి

కాజీపేట : పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరుతూ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు సామాజిక కార్యకర్త కె.ప్రకాశ్ వినతిపత్రం సమర్పించారు. కొన్నేళ్లుగా నాయకుల పట్టింపు లేని తనంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని చైర్మన్‌కు విన్నవించారు. రియాజ్ స్పందించి భవనానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు రిజర్వేషన్ కల్పించాలి

ఎంజీఎం : రాష్ట్రంలోని మెడిసిన్ అడ్మిషన్ ప్రక్రియలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు రిజర్వేషన్ కల్పించాలని జాతీయ యువజన పురస్కార గ్రహీత, సామాజిక కార్యకర్త మండల పరశురాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అయన వినతిపత్రాన్ని కాళోజీ నారాయణ హెల్త్ యూనివర్సిటీ వీసీకి అందజేశారు. ఈ సందర్భంగా పరశురాములు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు ఇప్పటికే ఎన్‌సీసీ కేడెట్స్ కోసం మెడికల్ అడ్మిషన్స్‌లో రిజర్వేషన్ పాలసీ అమలు చేస్తున్నాయని, అదే విధంగా రాష్ట్రంలో కూడా అ విధమైన పాలసీని అమలు చేయాలని కోరుతున్నట్లు వివరించారు. దీనిపై వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సంఘటితంగా కాలనీ అభివృద్ధి చేసుకుందాం..

హన్మకొండ: కాలనీని సంఘటితంగా అభివృద్ధి చేసుకుందామని టీవీ టవర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి అన్నారు. శనివారం హనుమకండలోని టీవీ టవర్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ సర్వసభ్య ఆయన మాట్లాడుతూ ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. రాబోయే కృష్ణాష్టమి, గణపతి నవరాత్రి ఉత్సవాలు, దేవీ నవరాత్రి ఉత్సవాలను కాలనీ అభివృద్ధి కమిటీ, ఓం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులమంత కలిసి విజయవంతం చేసుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఉండవల్లి కిషన్ రెడ్డి, కోశాధికారి పూజారి మనోజ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ఓం యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్



మడికొండ : హనుమకొండ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్‌గా ఆకుల శ్రీకాంత్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలి పారు. పార్టీ అభివృద్ధికి నావంతు కృషి చేస్తానని అన్నారు. ఎల్లవేళలా పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని అన్నారు.

5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలి

హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ప్రతి నెలా 5వ తేదీ లోపే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లా అశోక్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబర్ 6 నుంచి సమ్మెకు పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేతనాలు చెల్లించాలని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం 55వ, 56 డివిజన్లలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పుల్లా అశోక్ మాట్లాడుతూ సకాలంలో వేతనాలు రాకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి నాగరాజు, శ్రీలత, సభ్యులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: నిరసన తెలుపుతున్న వైద్యులు



హన్మకొండ: నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



విద్యారణ్యపురి: నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు

దుండగులను కఠినంగా శిక్షించాలి

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటనను నిరసిస్తూ శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు, జెండాలు పట్టుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుంటే ఎలా అని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిలోని గొర్రెకుంట జంక్షన్ రోడ్డు వద్ద వైద్యులు, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. విద్యార్థిని మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఖిలావరంగల్ : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జీవన్ గౌడ్



మడికొండ : నిరసన తెలుపుతున్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



కాశిబుగ్గ: గొర్రెకుంట జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ఈఎస్ఐ హాస్పిటల్ వైద్యులు



వరంగల్ : కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నగరంలో కుండపోత వర్షం

- ప్రధాన రహదారులు జలమయం
- లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు



హనుమకొండలోని కొత్తబస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు



కాకాజీ కాలనీ రోడ్డుపై భారీగా చేరిన వరద నీరు

వరంగల్ అర్బన్/హన్మకొండ : వరంగల్ నగరంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతగా ఉన్న వాతావరణం.. సాయంత్రానికి మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఏకధాటిగా కురిసిన వర్షంతో వరద పోటెత్తింది. వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్, అండర్ బ్రిడ్జి, వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్డు, ఎస్‌వీఎన్ రోడ్డు, బట్టలబజార్, బీట్ బజార్, మేదరవాడ, పోచమ్మమైదాన్, ఆటోనగర్, ము లుగు రోడ్డు, హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, కాకాజీ కాలనీ, బాలసముద్రం, ఫాతిమానగర్, నయీంనగర్ రహదారులపై వరద నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో నీళ్ల చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురికివాడల్లోని ఇళ్ల చుట్టూరా నీరు స్తంభించిపోయింది.

కాజీపేట, హనుమకొండలో కుండపోత వర్షం పడింది. దీంతో ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. రోడ్లపై మోకాళ్ల ఎత్తు వరకు వరదనీరు చేరడంతో వాహన చోదకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి 9 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాల ప్రకారం కాజీపేటలో 69.3 మిల్లీ మీటర్లు, హనుమకొండ పెద్దమ్మగడ్డలో 57,5, వరంగల్ పైడిపల్లి ఏఆర్ఎస్‌లో 36.5, దుగ్గొండిలో 29, నల్లబెల్లి, గీసుకొండలో 18, కాశిబుగ్గలో 11.5, మడికొండలో 11, దామెరంలో 8.3, ధర్మాసాగర్‌లో 5.8, గొర్రెకుంటలో 3.8 వర్షపాతం నమోదైంది.

కేయూలో పెరిగిన మహిళల భాగస్వామ్యం



ఖిలావరంగల్ : న్యూ కౌటిల్యాస్ స్కూల్‌లో విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



హన్మకొండ : టీఎన్జీఓస్ యూనియన్ నాయకులకు రాఖీలు కడుతున్న మహిళలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మహిళల భాగస్వామ్యం పెరిగిందని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. రక్షాబంధన్ వేడుకలో భాగంగా శనివారం మహిళా ఉద్యోగులు రిజి స్ట్రార్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మహిళా ఉద్యోగినులను ఉద్దేశించి మాట్లాడుతూ కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అనుమతులు ఆదేశాల మేరకు ఉద్యోగునీల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శనివారం రక్షాబంధన్ కార్యక్రమంను నిర్వహించారు. హెచ్ఎం నెహ్రూ పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

సహృదయలో రాఖీ వేడుకలు

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ వృద్ధాశ్రమాన్ని శనివారం మడికొండ ఏకశిల పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు సందర్శించి వృద్ధులతో ఆత్మీయంగా గడిపారు. రాఖీలు కట్టడంతో పాటు పండ్లు, స్వీట్లను అందజేసి ఆత్మీయతను పంచారు. కార్యక్రమంలో ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ భిక్షపతి, వైస్ ప్రిన్సిపాల్ దీపక్ కుమార్, పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా : హనుమకొండ మాదిరెడ్డికుంటలోని ప్రోగ్రెస్ హైస్కూల్లో స్కూల్ కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఆశిష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, ప్రైమరీ ఇన్‌చార్జ్ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి తమ సోదర ప్రేమను చాటుకోవాలని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెస్ హైస్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం హెచ్ఎం సబిత ఆధ్వర్యంలో నిర్వహించారు.

టీఎన్జీఓస్ భవన్‌లో

హన్మకొండ: హనుమకొండ సుబేదారి జిల్లా కార్యాలయం సముదాయంలోని టీఎన్జీఓస్ యూనియన్ కార్యాలయంలో శనివారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్యతో పాటు నాయకులకు మహిళ ఉద్యోగులు రాఖీ కట్టారు. యూనియన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి రాజేష్, పాల్గొన్నారు.

హసన్‌పర్తి : హసన్‌పర్తిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుమన్, కిరణ్, ముదిరాజ్ సంఘం డైరెక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ నూతన కమిటీ



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కేయూ క్యాంపస్: వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ సర్వసభ్య సమావేశం శనివారం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జీవితకాల ఫౌండర్ చైర్మన్‌గా సిరాజుద్దీన్, ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా ఆచార్య బి.సురేష్‌లాల్, జనరల్ సెక్రటరీ గా శ్రీపాద సుధాకర్‌రావు ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా విద్యాసాగర్, జేపీ రాంచంద్రమూర్తి, కోశాధికారిగా పాడిశెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా పొన్నాల రాంమోహన్, కాజీపేట పురుషోత్తం, ఎన్నికయ్యా రు. పీఆర్‌ఓగా సామాజిక వేత్త నిమ్మల శ్రీని వాస్‌రావు ఎన్నికయ్యారు. అడ్వయిజరీ సభ్యులుగా కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, గంటా రాంరెడ్డి, నర్సింహామూర్తి, విజయబాబు, అనితారెడ్డి, వాగ్దేవి విద్యాసంస్థల అధిపతి దేవేందర్ రెడ్డి ఉన్నారు.

శ్మశాన వాటికలో సీసీ రోడ్డు నిర్మాణం

వరంగల్: గ్రేటర్ వరంగల్ కాశిబుగ్గ పోచమ్మమైదాన్ 21వ డివిజన్‌లోని ఎస్సీ శ్మశాన వాటికలో రూ.15 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రేకుల షెడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ ఫుర్ఖాన్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికలో మౌళిక వసతులు కల్పించాలని తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావులను కోరగా మంజూరు చేయించారని తెలిపారు. అదే విధంగా డివిజన్‌లో రూ.2.70 కోట్లతో నిర్మాణం చేపట్టిన శాంతినగర్ జంక్షన్ నుంచి అబ్బాస్ ఫంక్షన్‌హాల్, నర్సంపేట రోడ్డు వరకు ఎన్నికల కోడ్‌తో ఆగిపోయాయన్నారు. ఎస్సీ శ్మశాన వాటిక చైర్మన్ జన్ను సైకిలాబ్, శీలం శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

బల్దియా ఇన్‌చార్జ్ సీపీగా రవీందర్

వరంగల్ అర్బన్: బల్దియా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్‌గా డిప్యూటీ సిటీ ప్లానర్ రవీందర్‌ను నియమిస్తూ.. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జీహెచ్ఎంసీ నుంచి బల్దియా సిటీ ప్లానర్‌గా వచ్చిన శైలజ వ్యక్తిగతంగా నెల రోజుల పాటు సెలవుల్లో వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో రవీందర్ బాధ్యతలు చేపట్టారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఖిలా వరంగల్: ఖమ్మం జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడడంతో ముగ్గురికిగా గాయాలైన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ హెడ్‌పోస్టాఫీసు జంక్షన్‌లో వరంగల్‌కు చెందిన బ్రహ్మచారి, రేణుక, నవ్య ముగ్గురు ఆటో ఎక్కి రంగశాయిపేట వైపు బయల్దేరారు. ఫోర్ట్‌రోడ్డులోని వాల్‌మార్ట్ ఎదురుగా ఆటో రాగానే డ్రైవర్ ఆటోకు సడన్ బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఈద్గా ఖబ్రస్తానంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన సయ్యద్ అర్బాత్, ఎండీ.మాషూక్ అలీ, ఎంఏ జబ్బార్, సయ్యద్ ఇబ్రహీం ఖలీల్‌పై ఎంఏకే తన్వీర్ ఫిర్యాదు చేశాడు. శనివారం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు.

యువకుడి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ బాలాజీనగర్ సెకండ్ డాక్టర్స్ కాలనీ బృందావన కాలనీకి చెందిన తుమ్మనపల్లి గణేశ్ శుక్రవారం నుంచి కనిపించడం లేదని తండ్రి వీరాచారి శనివారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

కాజీపేట: మనవడితో ఆటో ఎక్కి కాజీపేట వైపు వచ్చిన ఓ వృద్ధురాలు ఎక్కడికి వెళ్లాలో తెలియక వర్షంలోనే తడుస్తూ ఏడుస్తుండగా గుర్తించిన సీఐ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన శనివారం రాత్రి జరిగింది. హనుమకొండకు చెందిన సేవతి దేవి, రిక్కిలు ఆటో ఎక్కి వచ్చారు. ఎక్కడికి వచ్చిందో తెలియక మనవడితో అటు ఇటూ తిరుగుతోంది. ఆ సమయంలో సీఐ వర్షంలో తడుస్తున్న వారి వద్దకు వెళ్లి ఆరా తీయగా జరిగిన విషయాన్ని చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది. వెంటనే సీఐ కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డీఐఈఓ కార్యాలయం ఎదుట నిరసన

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ కళాశాల నిర్వహిస్తుంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ బాధ్యులు శనివారం హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. భీమారం వద్ద ఓ ప్రైవేట్ కళాశాల ఏర్పాటుకు అనుమతి తీసుకొని వేరే చోట నిర్వహిస్తున్నారన్నారు. వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేటలో అనుమతి ఉంటే ఆ కళాశాలను పోచమ్మమైదాన్ వద్ద నడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, స్వేరోస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు సేవలు విస్తరించాలి

- లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబురావు



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మడికొండ: లయన్స్ సేవా కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ గన్నమనేని బాబురావు అన్నారు. శనివారం మడికొండలోని రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన 320 ఎఫ్ లయన్స్ జిల్లా 9వ ఇన్‌స్టాలేషన్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 80కి పైగా లయన్స్‌క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 320ఎఫ్ జిల్లా నూతన క్యాబినెట్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా 50 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. అలాగే 100 మంది విద్యార్థులకు సైకిళ్లను బహూకరించారు. ముందుగా గ్యాట్ ఏరియా లీడర్ పీఐడీ ఆర్. సునీల్‌కుమార్ జిల్లా లయన్స్ నాయకులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో డాక్టర్. చంద్రశేఖర్‌ఆర్య, నరహరి సుధాకర్ రెడ్డి, డీసీఎస్‌గా సయ్యద్ హబీబ్, డీసీటీగా నివేదితారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు హైకోర్టు న్యాయవాది దీపక్ భట్టాచార్జీ, ఎస్.నరేందర్‌రెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హనుమాండ్ల రాజిరెడ్డి, కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర్‌రావు, తీగల మోహన్, జిల్లా క్యాబినెట్‌లో రీజియన్ చైర్మన్ పెద్ది రేవతి, జె. రాజిరెడ్డి, కొదండపాణి, జి.సురేష్‌కుమార్, మర్యాల యాదిరెడ్డి, ఆర్. వెంకట్‌రెడ్డి, కే. భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జోన్ చైర్మన్లు, ఇతర క్యాబినెట్ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి పి.వేణుమాదవ్‌రావు, మాస్టర్ ఆఫ్ సెర్మనీగా వ్యవహరించారు.

'అతిథి' ఆశ్రమాన్ని ఖాళీ చేయాలి

- నిర్వాహకులకు కోర్టు వారెంటు జారీ



వారెంటును అందజేయడానికి ఆశ్రమానికి వచ్చిన సిబ్బందితో మాట్లాడుతున్న ఆశ్రమ నిర్వాహకులు

హన్మకొండ చౌరస్తా: తమ స్థలాన్ని అద్దెకు తీసుకుని కొన్నేళ్ల తర్వాత తమదేనంటూ మొండికేస్తున్నారంటూ సదరు యజమాని అతిథి దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆశ్రమాన్ని ఖాళీ చేసి భవన యజమానికి అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం హనుమకొండ రెడ్డికాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమానికి కోర్టు సిబ్బంది వారెంటు అందజేయడానికి వెళ్లగా వారెంటును తీసుకోలేదు. దీంతో బేలీఫ్ ఆఫ్ ది కోర్టు సిబ్బంది రాజేందర్, శ్రీనివాస్‌లు వెళ్లిపోయారు. వారెంటును అమలుపర్చనీయకపోవడంతో విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తామని, తదుపరి న్యాయపరమైన చర్యలు ఉంటాయని వారు తెలిపారు. బాధితుడు సాయం శంకరయ్య, కోర్టు అందజేసిన వారెంటుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ కేయూ బైపాస్ రోడ్ రెడ్డికాలనీలోని ఇంటి నెంబర్లు 3-14-515, 3-14-515, /ఏలోని భవనం, స్థలాన్ని 2011లో సాదు సుజాతకు అతిథి ఆశ్రమ నిర్వహణకు అద్దెకు ఇచ్చారు. 2019 శంకరయ్య తన ఇద్దరు కొడుకులకు గిఫ్ట్ డీడీ చేశారు. అనంతరం ఖాళీ చేయాలని ఆశ్రమ నిర్వాహకులను కోరగా తిరగబడ్డారని తెలిపారు. దీంతో హనుమకొండ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా 2023 వరకు ఖాళీ చేస్తామని చెప్పిన నిర్వాహకురాలు సుజాత తర్వాత చేయలేదని తెలిపారు. కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా షెడ్ వేసి, వాటి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తుందని శంకరయ్య తెలిపారు. ఆశ్రమ నిర్వాహణకు ప్రతినెలా అద్దె చెల్లిస్తూనే 2010లో నా నుంచి స్థలాన్ని కొన్నట్లుగా కోర్టులో కేసు వేసినట్లు చెబుతున్నారని అన్నారు. కోర్టు వారెంటును సైతం అమలుపర్చకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు.

సమస్య పరిష్కరించాలని వినతి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ బాధ్యులు

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని కేయూ లా కాలేజీని మూసివేసే పరిస్థితి దాపురించిందని లా కాలేజీకి అఫ్లియేషన్ ఫీజు చెల్లించి బార్‌కౌన్సిల్ నుంచి అఫ్లియేషన్ తీసుకోవటంలో జాప్యం చేశారని, దీంతో అడ్మిషన్లు రద్దయ్యే పరిస్థితి ఏర్పడిందని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ఇతర బాధ్యులు శనివారం రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిసి విన్నవించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ లా కాలేజీలో అరకొర వసతులతో కొనసాగిస్తున్నారన్నారు. ప్రతి ఏడాది విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని అఫ్లియేషన్ ఫీజు చెల్లించటంలో నిర్లక్ష్యం ఎందుకు చేశారని రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. వెంటనే అఫ్లియేషన్ ఫీజును బార్ కౌన్సిల్‌కు చెల్లించి వెంటనే అనుమతి తీసుకొని ఈ విద్యాసంవత్సరంలో లా అడ్మిషన్ల ప్రక్రియలో లా కాలేజీలో అడ్మిషన్లు జరిగేలా చూడాలని విన్నవించినట్లు స్టాలిన్ తెలిపారు.ఎస్ఎఫ్ఐ బాధ్యులు జస్వంత్, అరుణ్, అజయ్, రాకేష్, సందీప్, ఉదయ్, కిరణ్ తదితరులు కలిశారు.

సంక్షిప్త వార్తలు

జీతాలు సకాలంలో చెల్లించాలంటూ ఆందోళన

కాజీపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం తెల్లవారుజామున సీఐటీయు కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేపట్టారు. మున్సిపల్ యూనియన్ మండల ఉపాధ్యక్షులు రవీందర్, సుశీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలి

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం న్యూశాయంపేటలోని కందుల బండ ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ బావుసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 579లో కందుల బండ ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు సీపీఎం ఆధ్వర్యంలో గతంలో గుడిసెలు వేసుకున్నారు. కాగా ఇటీవల కబ్జాదారులు గుడిసెలను తొలగించి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, వారిపై తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, ఓరుగంటి సాంబయ్య, ఉన్నారు.

హరిత కాకతీయలో రుద్రాక్షల ఎగ్జిబిషన్



హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నేపాల్ రుద్రాక్షల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నేపాల్ రుద్రాక్షల ఆర్గనైజేషన్ ఎండీ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శన 19వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఏకముఖి నుంచి 21 ముఖమలు వరకు రుద్రాక్షలు చోటు చేసుకున్నాయని వివరించారు. అరుదుగా లభించే సిద్ధమాలలు, ఐశ్వర్యలక్ష్మి మాల, దక్షణావృతశంకులు, పంచముఖి రుద్రాక్ష జపమాలలు, సాలిగ్రాంలు, స్పటికమాలలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాఖీ పౌర్ణమికి చేతికి ధరించే బ్రాస్‌లెట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్: వరంగల్ జిల్లాలోని ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆగస్టు 31వ తేదీ లోగా, అత్యున్నత తరగతి విద్య స్కాలర్ షిప్ కోసం అక్టోబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డిపార్ట్‌మెంటు వెబ్‌సైట్ www.depwd.gov.in నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ www.scholarships.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మెడికల్ క్యాంపునకు సహకరించాలి



వరంగల్: వరంగల్ 3వ పైడిపల్లిలోని రచ్చబండ సెంటర్ వద్ద ఈనెల 28న మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని క్రైస్తవ హక్కుల రక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెడికల్ క్యాంపునకు అన్ని విధాలా సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సత్యశారదను సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బిషప్ జన్ను ఇర్మియా కోరారు. శనివారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 3వ డివిజన్‌కు చెందిన పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట గ్రామాల ప్రజలు సుమారు వేయి మంది ఈ క్యాంపులో పాల్గొంటారని తెలిపారు. సమితి ఉపాధ్యక్షుడు సిహెచ్.రత్నంరాజు, పాస్టర్లు సుదర్శన్, కొండపాక పీటర్, కె.విజయ్‌చందర్, కన్వీనర్ ఆరోగ్యం, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను బహుజనులకు పంచాలి



వరంగల్ చౌరస్తా : ప్రభుత్వ భూములను బహుజనులకు పంపిణీ చేయాలని బీఎల్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి నర్ర ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదవాడి ఇంటి కోసం 60 గజాలు భూమికోసం వేసుకున్న పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ విధానాన్ని మార్చుకొని ప్రజలకు అనుకూలంగా నిర్ణయం చేయాలని లేకుంటే ప్రజలు పోరాడి సాధించుకోవాలని అన్నారు.